# వెలుగు నీడలు

[ కథానిక ]

— శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి —

తెల్లవారింది.

బద్ధకంగా లేచాను.

రాత్రి చాలాసేపు నిద్రమేలుకుని వ్రాసిన విక్రమోర్వశీయ పద్యకావ్యపు స్వర్గీయదృశ్యాలు తియ్యని స్మృతుల్ని కదిలిస్తున్నాయి.

ఊర్వశీ దివ్యసౌందర్యం నా పద్యాల్లోకి కాంతిధారగా ప్రవహించి ఒచ్చినట్టనిపించింది.

పురూరవ చక్రవర్తి మధుర స్నేహసల్లాపాలతో నా కావ్యం పులకరిల్లినట్టు తోచింది.

సుధర్మలో, భరతముని ప్రయోగించే నూతన నాటికలోని నాయికాపాత్ర ధరించి, ఆ అప్సరః సుందరి, స్త్రీరమణీయతా సర్వస్వంగా రంగభూమికి అవతరించినప్పుడు వ్రాసిన ఈ పద్యం...

“రేషనుషాపు తీసే వేళ అయింది. చప్పున కాఫీ పుచ్చుకు వెడతారా? పాపం రాత్రి చాలా-సేపు మేలుకున్నారు. ఏం చెయ్యను? తెచ్చుకునే రోజు. తప్పదు”

ఇంద్రసభకు బదులుగా మా చాలీచాలని అద్దె వాటా, నాట్యఉజ్జ్వలరూపిణి ఊర్వశికి బదులుగా నిత్య సంసారయాత్రలో నలిగే పాతగళ్ళచీర బ్రాహ్మణీ కనపడేసరికి నా పురూరవచక్రవర్తి హిందూదేశంలో ఒక నాగరిక పట్టణంలోని ఆరో నెంబరు రేషనుషాపు దగ్గరకు నడవలేక చట్టున తప్పుకున్నాడు.

ఎదురుగా కనబడే సిమెంటుకంపెనీ కాలెండరు మీద ౧౫౪ సంవత్సరం ౧౭ తారీఖు వాస్తవజగత్తులో కనబడేసరికి నా ఒళ్ళు దహించుకుపోయింది.

బియ్యం లేవని తెలియగానే ఆకలి ఎక్కువగా ఉంది. అంత దివ్య సౌందర్య భూయిష్ఠ కళాసంపదను భావనాసంపత్తితో పుడమికి అవలీలగా అవతరింపచేయగల ఆంధ్రకవీశ్వరునకు ఆకలి కలిగిందంటే ఎంత నీచం!

కాని వేస్తోంది!

ఎవరితోనూ అనకండి, బాగుండదు.

మహేంద్రుడుగాని, అమరవేశ్యగాని ఈ కరువు రోజుల్లో నా కట్టిసహాయం చెయ్యలేరని రూఢిగా తెలిశాక మానిపోయిన కేన్వాస్ సంచీ పుచ్చుకొని కాళ్లీడ్చుకుంటూ బజారుకు నడిచాను.

ఈనాటి కవి నిజస్వరూపం ఎదుట నిలువుటద్దం లేకపోయినా స్ఫుటంగా నా కళ్లల్లో ఆనింది.

రోడ్డు ఎక్కేసరికి జమీందారుగారి కొత్తకారు రంయిమని నడిచేవారి కంట్లో దుమ్ముకొట్టి పరిగెత్తింది.

చట్టున టౌనుహాల్లో జరగబోయే గౌరవార్థపు టీపార్టీలోని తేనీటిసువాసన నా మెదడుకు తగిలి వికారపెట్టింది.

పట్టణానికి ఒకవైపున చాలీచాలని కొలబత్తెపు బియ్యంకోసం తొక్కిడిపడే దౌర్భాగ్యుల కోలాహలమైతే—ఇంకోవైపున బలిసిన లంచాల చేతులు కమ్మని వెచ్చని పదార్థాలను సమృద్ధిగా సిల్కుసూట్ల బొజ్జల్లోకి నెమ్మదిగా జార్చడం గమ్మత్తుగా జ్ఞాపకం వచ్చి నవ్వాను.

రోడ్డుమీద జనప్రవాహం ఏవైపు నడుస్తున్నదో తెలియలేదు.

అప్పుడే రేషనుషాపు తెరిచారు.

అధికారులు పిచ్చుకవ్వలతో మట్టిరంగుబియ్యం రూపంలో న్యాయాన్ని పంచుతున్నారు. పవిత్ర ఆర్యావర్తభూమిలో—

చప్పున షాపులోకి చొరబడడానికి వీలులేదు. నరశరీరాల గోడ అప్పటికే బలంగా ఏర్పడిఉంది.

కొంతసేపు గడిచింది. ఉన్వేత్తుగా మానవదేహ భిత్తిక బీటవారి లోపలినుంచి ఒక కలకలం వినపడడం మొదలుపెట్టింది.

మేం ఆశ్చర్యపడి చూస్తున్నాం.

గుమాస్తా కీచుగొంతుకతో అరుస్తున్నాడు. అయిదునిమిషాల తర్వాత కీచుగొంతూ, ఇద్దరు నౌకర్లూ చేతుల్లో శక్తి అయిపోయీదాక బాది ఒక పదార్థాన్ని రోడ్డుమీదికి తెచ్చి విడిచిపెట్టారు.

అది నెమ్మదిగా కదిలి అంటుకున్న రోడ్డుదుమ్ము దులుపుకుని, ఊడిపోయిన చిరుగుల తలగుడ్డను సవరించుకొని వెనకవాలికలై ముందు మాసికలతో నిండిన చొక్కాతో పాలిపోయిన ముఖంమీద మొహమాటంగా పెరిగిన పేడిగడ్డంతో మూటలు మోసే కూలీగా లేచి నించుంది.

వాడు ఏమీ జరగనట్టు, తగిలిన చోట చేతితోనైనా తడుముకోకుండా ముందుకు నడిచి పక్కతూము మీద కూచున్నాడు.

బియ్యం కొన్నాను. ఇటూ అటూ చూశాను· క్షతమైనవారైతే స్వయంగానే పట్టుకుపోవచ్చు· కాని......

"బాబూ, కూలీ కావాలా ?"

—పరుగెత్తుకుంటూ వచ్చాడు.

"ఎంత ?"

"...బేడ"

"పావలా ఇస్తాను. పట్టుకో"

చాలా సహజంగా అన్నాను. కాని—తిన్న దెబ్బలకన్న ఆ మాట పలిపిందిగాబోలు. సిగ్గుపడి తల ఒంచుకుని మూట పుచ్చుకున్నాడు.

వెనకనించి అందుకున్నారు—

"మంచివాడు దొరికాడు"

"సగం బియ్యం తోవలో తినేస్తాడు"

"పచ్చి దొంగవెధవ"

"ఊరికే.తన్నారా గుమాస్తాగారు?"

"ఇంక కూలి ఎందుకు ?"

"ఏం ? బేడ అడిగితే పావలా ఇచ్చే మహానుభావులు దొరికాక..."

"సామ్యవాదులండీ !"

దూరమై ఇక వినపడలేదు.

"నీపే రెవరమ్మా"

నడుస్తూ తోచక వేసిన ప్రశ్న.

"సన్నాసండి"

" పద. "

చేతిలో పడ్డ పావలాకాను చూసి సన్నాసి మొహం మరింత పాలిపోయింది. స్వార్థావరణం చీల్చి నిజమైన మనస్సు తెరచి చూపితే మనుషులు ఎంతదగ్గరకు వస్తారు ! కాని నమ్మం. అదే ఈనాటి నాగరికతలో ఉన్న కీలకం.

మూర్ఖుడు. అనాగరికప్రాకృతుడు. వాడికి సనాతన సాంఘికమర్యాద లేమి తెలుసు ?

కొంతసేపటికి సన్నాసిముఖం సంతోషంతో నల్లబడి—పురూరవ సార్వభౌముడు కాలీ చేసినచోట వెల్లి కూర్చుంది.

* * *

సోమవారం సంత.

ఫెళ్ళున సాగుతోంది.

ఇంద్రనీలమణిరాసులవంటి నీటి వంకాయ గుట్టలూ, పచ్చులవంటి బచ్చలికూరస్తూపాలూ, కెంపులవంటి ఉల్లిగడ్డల పర్వతాలూ సాయంకాలపు ఈ రెండ తగిలి మిలమిలా మెరుస్తున్నాయి.

విజయనగర సామ్రాజ్యం ఉచ్ఛదశలో వెలిగేటప్పుడు వర్తకులు రాజవీథిలో రత్నాల రాసులు పోసి పట్టు బాలీసుల కానుకుని అమ్మడం చూశానని అబ్దుల్ రజాక్ అన్నమాటలు నానాటికి ఆంధ్రదేశంలో సోమ

వారం సంతగా ప్రత్యక్షమైనందుకు సంతోషిస్తూ, మనకు ఏ రకం రత్నాలు ఎన్ని వీశలు కావాలో నిర్ణయించలేక ఆలోచిస్తున్నాను. నిండా అన్నం లేని ప్రజలకు ఇన్ని కూర లెందుకో!

అరటికాయల దుకాణం దగ్గర ఘొల్లుమని చప్పుడయింది.

తిరిగిచూశాను.

చుట్టూ చేరిన నలుగురు 'పెద్దమనుషుల' మధ్య మా కథానాయకుడు సన్నాసి కనపడ్డాడు. అధికార ముద్ర తగిలినట్టు దవడ ఎర్రగా కందింది.

ఒక కాపుపెద్ద చేత్తో కూరల బరువు మూట పట్టుకుని రెండో చేతితో సన్నాసిని ఒడిసి పట్టుకుని అన్నాడు.

"యెదవలు...కూలిపని చేసుకోరాదూ, దొంగ గడ్డి తినకపోతే...మూట లాగుతున్నాడు. సవట..."

కాలెత్తి, మళ్లా దయదలచి ఊరుకున్నాడు. గాంధీగారి అహింసా సిద్ధాంతం మీద చాలా గౌరవం ఉన్నవాడు!

"తప్పు కాదండీ—లేకపోతే... అడుక్కోవాలి...."

మూకలో ముందున్న పంగనామాల తగుమనిషి పళ్ళులేని బోసినోటితో దేశంలోని నిరుద్యోగ నిర్మూలన రహస్యం నిమిషంలో పరిష్కరించి ఊరుకున్నాడు.

సన్నాసికి ఊపిరితిరిగింది.

"మూట తెమ్మన్నారా బాబూ! అణాడబ్బులిప్పించండి. ఇంటికాడికి. అందుకోసమే మూట ముట్టుకుంటే..."

"ఛప్! నోరుముయ్యి. దొంగగాడ్దె! నాకు నీకూలెందుకురా! ఇలాంటివి పదిమూటలు పట్టికెళ్లగలను. బుద్ధిగా బతుకు. తన్నులుతినేవు..." అని వెళ్లిపోయాడు.

"మంచిపని చేశాడు. చూస్తే కూలి, చూడకపోతే నాలి. నాలిముచ్చువెధవలు" ఒక శ్రోత్రియ బ్రాహ్మణోత్తముడు అరటాకుల కొట్టుదగ్గర్నుంచి తన అభిప్రాయం వెల్లడించాడు.

మళ్ళా మామూలుగా జనప్రవాహం సంతలోకి ప్రవహిస్తోంది.

అలజడి క్రమంగా తగ్గింది.

సన్నాసి నెమ్మదిగా ఏదో కాలికింద గుచ్చుకున్నట్టుగా ఒంగి ఇందాకటి ఘర్షణలో పెద్దకాపు రొంటినుంచి జారగా ఇంతవరకూ ఎడంకాలి బొటన వేలితో తొక్కిపెట్టిన వస్తువును పదిలంగా తీసి బజార్లో నల్లమందుకొట్టువైపు చరచరా నడిచాడు.

* * *

సిరావర్షంలా చీకటి అలముకుంది.

రాత్రి పదిగంటలు దాటింది.

మబ్బుగా ఉంది.

చలిగాలి చెలరేగింది.

వెచ్చని అన్నం తిని ఇనప్పెట్టెలలాంటి గదుల్లో కాశ్మీరశాలువల్లోకి కమనీయగాథల్లోకి వెళ్ళిపోయే వారికి ఆరాత్రి ఎంత వరప్రసాదం! ఒక్క చలిరాత్రి చల్లారిపోయే ఎన్నిగుండెల్ని జ్వలింపజేస్తుంది!

సంతపాకలు తప్ప ఊరంతా, ఒత్తిగిలడానికి కూడా బద్ధకంగా నిద్రపోతోంది.

పగలంతా బైరాగివేషంతో తిరిగే ముసలిజంగం పాతపడవ ఒకరేవుకు చేరినట్టు సంతపాకల్లో ఒకమూల చేరి కొంతగడ్డి పోగుచేసి మంట వేసి గుడాకుపొగ తాగుతూ దగ్గుతున్నాడు.

చవకరకంకల్లు తాగి యెవరో పడమటియాసతో కీచులాడి తిట్టుకుని నోరునొప్పెట్టి సంతపాకల నాపరాళ్లమీద ఒరిగారు.

అక్కడికి కొంతదూరంలో చింతచెట్టుకింద బసచేసిన ఎఱుకల కుటుంబంలోంచి ఎఱుకలపిల్ల నీలాలు చట్టున మెలుకువ ఒచ్చి కూచుంది. అన్ని ముష్టికుటుంబాలూ ఒళ్లు తెలియకుండా నిద్రపోతున్నాయి. ఎటు చూచినా కారుచీకటి రాత్రి. పక్కని తలవిరబోసుకున్న దెయ్యంలా పెద్ద చింతచెట్టు.

భయమేసింది.

తల్లిని లేపుదామని ఊరుకుంది.

"భయంమాట కేంగాని, ఈ చీకటిరాత్రులు పడుచుమనస్సులకి ఎంత సరదాగా ఉంటాయి!" అనుకుంది నీలాలు, గొంతుగా కూచుని నిద్రలో చెదిరిన జుట్టు ఎగదోసుకుంటూ.

సందేళ తాగిన గంజి ఉడుకు చల్లారిపోయింది. ఆకలి మండిపోతున్నది.

పడుచుపిల్లకు చారెడు గంజినీళ్ల బలం ఎంతసేపు?

చలిగాలి రివ్వున కొట్టింది.

లేతాకులా గజగజలాడి ఒళ్లంతా కప్పని గుడ్డతో వక్షాన్ని కప్పబోయింది.

రెండుచేతుల్నీ బలంగా 'ఇంటూ'గుర్తులా చేసి గుండెలకు అదుముకుంది.

మెఱుపు మెరిసింది.

ఆకలి భగ్గుమంది.

లేచి నించుంది.

ఎదురుగా మంచంమిఠాయి పెట్టెకొట్లు కనబడుతున్నాయి.

మూసిఉన్న కొట్టులోంచి మిఠాయి ఎల్లా ఒస్తుంది?

ఏమో?

ఆకలిగా ఉంది మరి—

నవ్వింది.

నున్నని నల్లశానపురాయిలా నిగనిగలాడే ముఖంలో పళ్లు మెరిశాయి.

అడవిలో ముళ్ల పొదలమీద అడవిమల్లెపూలు జ్ఞాపకంవస్తాయి. ఎవరు చూశారు?

చుక్కలు లేని ఆకాశం సిగ్గుపడింది.

పెట్టెకొట్టు అడుగున ఏ బల్లఐనా ఒదులుగా ఉండగూడదూ?

"దొరికితే చంపేస్తారు"

"ఈ ఆకలి బతకనిస్తోందా?"

"అది మొగోళ్ల పని"

మొగాడనగానే నవ్వొచ్చింది.

"ఆకలికి మొగా...ఆడా ఉందా?"

ఒక మొగాడు ఎట్లాగో తంటాలుపడి కొట్టు బద్దలుకొట్టి 'ఇదిగో మిఠాయి' అంటే ఎంత బాగుండును అనుకుంది.

కొట్టుపక్క ఏదో నీడ కదిలింది. గుండెలు పట్టు జారినట్టనిపించింది. మనస్సు కూడదీసుకుని కొట్టు పక్క నక్కి కూచుంది.

రెండు నిమిషాలు నిశ్శబ్దం.

కొట్టు వెనక బల్ల ఊడలాగుతున్నట్టు వినపడి ప్రాణం కుదటపడి మెల్లగా అక్కడికి మోకాళ్లమీద పాకి తలయెత్తింది.

నీడ పారిపోయింది.

నీలాలు నాలిక కరుచుకుంది.

నోటిదగ్గర కూడు జారిపోయిందని విచారించింది.

నిటాగ్గా నించుని చూడగా వెనకతట్టు ఒక బల్ల సగం ఊడిఉందిగాని ఒక మేకు పట్టుమాత్రం ఎక్కువగా ఉంది.

బలంకొద్దీ బల్లను గుంజి లాగింది. కదల్లేదు. ఒక కాలితో అడుగుభాగం తన్నిపెట్టి చెక్క పెకలించింది. బల్ల చప్పున ఊడి నీలాలు తూలి వెనక్కు పడిపోయింది. నీడ రెండు చేతులూ చాపి పట్టుకొని నించోబెట్టింది. చెమటపట్టిన చల్లని వెన్నుమీద వెచ్చని చేతులు బిగువుగా ఆనుకునేసరికి ఆ స్పర్శతో ఒక విశ్వరహస్యం అర్థమై పోయినట్టు తోచింది ఇద్దరికీ.

నీరసంతో అంతవరకూ చురుకుగా కదలలేని రెండు చేతులూ కొత్తగా చిగిర్చినట్టు పని చేస్తున్నాయి.

నీడ నెమ్మదిగా లోపలికి దూరి చీకట్లో వెదికి ఒక వేరుసెనగ నూనె మిఠాయిజంగిడి పట్టుకుంది.

నీలాలు సాయంచేసి ఇవతలికి లాగింది.

కొన్ని లోపలికి జారిపోయినా జంగిడితో కొన్ని వచ్చాయి.

నీలాలు జంగిడితో కలిపి తినేసేటంత ఆకలితో ఉంది. నీడకు ఇద్దర్నీ కలిపి తిందామని ఉంది.

"కూకో. తినేసేపోదాం. మళ్లా మోతెందుకు?"

"సాల్లే. ఎవరన్నా సూత్తే పక్కలిరుగుతాయి."

"ఈ రోజువోరసే ఇల్లా ఉంది."

"మొగసన్నాసికే ఇంత పికరైతే... ఇక ఆడోళ్ళ కంతా కూడే..."

"ఆసి... నీవంటే... నీలీ! కనిపెట్టేశావ్."

"ఓరి... నీవంట్రా! పోల్చేశావు!"

"నడూ... నాన్నక..."

ఇటూ అటూ చూసి నీలాలు కర్రపళ్లెం చేతిలో పెట్టింది.

"తూరుపెంపుపాక కాడ ఎవరూ నేరు. అక్కడికి పోదాం"

నడుస్తున్నాడు.

పక్కదుకాణంబడ్డీమీద మనిషి కదిలినట్టయింది. కుక్క బొంయిమంది.

సన్నాసి చెంగున మురుక్కాలవ దాటి పరిగెత్తబోయాడు. కాలు జారి మిఠాయి జంగిడి కాలవలో పడిపోయింది.

ఇద్దరూ పరిగెత్తి తూరుపువైపు సంతపాకదగ్గరికి రోజుకుంటూ చేరారు.

మెల్లగా మొగవాడు అరుగెక్కి నిరాశగా ఒకమూల ఇరికి కూచున్నాడు.

నీలాలు వెళ్లి దగ్గరగా కూచుంది.

ఏమి మాటాడాలో ఇద్దరికీ తెలియలేదు.

సన్నాసి నీరసంగా తలగుడ్డ నేలమీద పరిచి ఒరుగుతూ అన్నాడు: "ఒట్టి అలుపు మిగిలింది..."

"నీ కరమ్మ"

అద్వైతసారం ఒంటబట్టిన వేదాంతిలా నీలాలు వెటకారంగా నవ్వి వాడి బుజంమీద కొట్టింది.

నీలాలకళ్లు ఆ కటికి చీకట్లో తెల్లనిప్పుల్లా మెరిశాయి.

"ఈయేల కింతే పెట్టిపుట్టాం"

'ఉపనిషన్మధు'వొలికిన చోట పుట్టిన వాడు పలికాడు.

కాని వేదాంతికి కడుపు మండుతోంది. కన్నులు ఎంత నులిమినా మూతపడడం లేదు.

"మిటాయీ పోయి ఎర్రియేదాంతం మిగిలిందిరా మనకి" అని మరింత దగ్గిరిగా జరిగి, దాచిన ఒక్క మిఠాయిఉండ రెండుముక్కలు చేసి ఒకటి వాడిచేతిలో పెట్టి తనొకటి తిని కూచుంది.

చిటపట చినుకులు ప్రారంభింది టిన్ రేకు దారుణంగా ధ్వనిస్తోంది.

చలిగాలి రివ్వున కొట్టింది.

నీలాలు మాటాడకుండా ఒణికింది.

వర్షం ముదిరిపోతోంది.

సన్నాసి మూలిగి, జల్లుకొట్టని వెంపుకి పక్కమార్చి బద్ధకంగా కళ్ళు మూసుకున్నాడు. తగినంత గుడ్డలేని వెచ్చని వక్షస్థలం చుర్రున తన బుజానికి తగిలేసరికి మానవుడి తరతరాల నాటి ఉష్ణవాంఛలకో ఒక్కసారిగా వాడి మనస్సు అంటుకుంది.

తన ఒంటిమీది గాయాలను ఒక్కటొక్కటిగా మృదువుగా తాకే మెత్తని రెండు చేతులనూ తీసి కళ్ల కద్దుకున్నాడు.

బుద్ధి ఎరిగినప్పటినుంచీ ఈసడింపులూ, అవమానాలూ మాత్రమే చూసినవాడి గాజుకళ్ళు తలవని తలంపుగా చెమ్మగిల్లాయి.

వాన కురుస్తూనే ఉంది.

మళ్ళా తెల్లవారుతుందని, ఆ చల్లని చీకటిరాత్రి దయతో వాళ్ళకు జ్ఞాపకం చెయ్యడం మానేసింది.